క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన పెద్దమోని అమృతకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.24 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం బాధితురాలికి స్థానిక నాయకులు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, చెన్నయ్య, యాదయ్య, ప్రేమ్‌చారి, క్ష్మయ్య, యాదగిరి, సురేశ్, కరీం తదితరులు ఉన్నారు.

17వ రోజుకు చేరిన రిలే దీక్ష



దీక్షకు మద్దతుగా మాట్లాడుతున్న యాదగిరి

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, పరిధి గ్రామాల్లోని వ్యవసాయ పోలాల మీదుగా 765 కేవీ బీదర్- మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని మండల కేంద్రంలో రైతులు చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 17వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నింగ్యారి యాదగిరి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌యాదవ్, పెంటారెడ్డి, మల్లేశ్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



అశోక్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కార్యకర్తలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాయపోల్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు పోలమోని అశోక్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కిషన్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కృపేష్, నాయకులు వెంకటరమణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, శ్రీశైలం, భరత్‌రెడ్డి, మైసయ్య, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో స్వచ్ఛ పక్వాడ



ప్రభుత్వాస్పత్రి ఆవరణలో చెత్తను తొలగిస్తున్న బీజేపీ

ఇబ్రహీంపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి పరిసరాల్లోని చెత్తచెదారాన్ని బీజేపీ నేతలు తొలగించి శుభ్రం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, రాంరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మహేందర్, సంతోష్, సురేష్, గోవర్ధన్, సాయిగౌడ్, శివ, సాయిరాం, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వినోభానగర్‌లోని మాతాపితరుల సేవా సదనంలో మాజీ కౌన్సిలర్ విజయ నిర్మల వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె భర్త యాదయ్య వర్ధంతిని పురస్కరించుకొని వృద్ధాశ్రమంలో అన్నదానం చేసినట్లు తెలిపారు.

ప్రాంగణం లేక.. ఇక్కట్లు తొలగక

- కడ్తాల్‌లో రోడ్డుపైనే ఆర్టీసీ బస్సుల నిలుపుదల
- తరచూ తలెత్తున్న ట్రాఫిక్ సమస్యలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



రోడ్డుపైనే నిలిపిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

కడ్తాల్: ప్రయాణ ప్రాంగణం లేక కడ్తాల్ మండలవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై గతంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న బస్‌షెల్టర్ ఉండేది. అందులో పది నుంచి పదిహేను మంది ప్రయాణికులకు వానొచ్చిన, ఎండొచ్చిన కాస్త రక్షణగా ఉండేది. ఎనిమిదేళ్ల క్రితం రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంతో దాన్ని కూల్చివేశారు. అప్పట్లో రోడ్డు నిర్మాణ సంస్థ రెండు ప్రదేశాల్లో షెలర్‌లు నిర్మించినా అక్కడ బస్సులు నిలుపడం లేదు. కడ్తాల్ వాణిజ్య, వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నా ప్రయాణికులకు మాత్రం నిలువనీడ మాత్రం కరువైంది. బస్సులు నిలపని చోట షెల్టర్‌లు నిర్మించడంతో ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు షెల్టర్‌ల వద్ద బస్సు నిలుపుతారేమేనని అక్కడ ఉంటే, మరో చోట నిలబెడుతుండటంతో ఉరుకుల పరుగులు తీస్తున్నారు.

చెట్లు సైతం లేవు

గతంలో రోడ్డు విస్తరణ చేపట్టక ముందు బస్సుల కోసం వేచి ఉండటానికి ప్రధాన రహదారిపై చెట్లైనా ఉండేవి. ప్రస్తుతం గ్రామంలో నిలువ నీడ కరువైంది. ఎండకు, వానకు, దుమ్ముధూళికి బస్సుల కోసం నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలో రెండు కిలో మీటర్ల మేరకు 4 లేన్ల రహదారిగా విస్తరించారు. గతంలో ఉన్న షెల్టర్ కూల్చి, వేరో చోట మరో రెండు షెల్టర్‌లు నిర్మించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ వద్ద బస్సులు నిలుపక పోవడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు.

నిత్యం రద్దీగా..

మండల కేంద్రం మీదుగా నిత్యం వందలాది బస్సులు తిరుగుతుండటంతో రహదారి ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్సులు రోడ్డుపైనే ఆపడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మరోవైపు బస్సుల కోసం ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తోంది. ఇప్పటికైనా మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులతో పాటు, అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



నిరుపయోగంగా బస్‌షెల్టర్

బస్టాండ్ నిర్మించాలి



మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పైనే వాహనాలు నిలపడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాసేపు విశ్రాంతి తీసుకునేలా అన్ని వసతులతో కూడిన బస్టాండ్ నిర్మించాలి.

– లక్ష్మణ్, ప్రయాణికుడు, కడ్తాల్

రోడ్డుపై నిరీక్షణ



మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. నిత్యం కడ్తాల్ మీదుగా వందలాది ఆర్టీసీ బస్సులు వివిధ జిల్లాలకు రాకపోకలు సాగిస్తాయి. బస్టాండ్ లేక పోవడంతో ఆయా రూట్లో వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపై నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

– దాస్, స్థానికుడు, కడ్తాల్

రైతులకు అన్యాయం జరగనివ్వను

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: ట్రిపుల్‌ఆర్ రోడ్డు విషయంలో రైతులకు అన్యాయం జరగనివ్వనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలు నమ్మి రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ట్రిపుల్‌ఆర్ దక్షిణభాగం రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని వివరించారు. ట్రిపుల్ ఆర్ ప్రతిపాదన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వచ్చిందని దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపిందని గుర్తుచేశారు. కల్వకుర్తి ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

రూ.15 కోట్లు మంజూరు

ఆమనగల్లు మున్సిపాలిటీ అబివృద్ధికి ప్రభుత్వం టీఎఫ్‌యూడీఐసీ ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటికే రూ.32 కోట్లతో మంచినీటి పనులను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం రూ.10 కోట్లతో నిర్మించే రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఈ నెల 25న ఎంపీ మల్లు రవితో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, రాములు, మానయ్య, శ్రీకాంత్, శ్రీశైలం, విజయ్, బాబా, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, ఫరీద్, శ్రీను, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి దైవ చింతన ఉండాలి



శివానందస్వామిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: దైవ కార్యక్రమాల్లో ప్రజలంతా పాలుపంచుకోవాలని శ్రీ రామదూత ఆశ్రమ పీఠాధిపతి శివానందస్వామి కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దైవ కార్యక్రమాలు లోక కల్యాణానికి ఉపకరిస్తాయని చెప్పారు. ప్రతిఒక్కరూ భక్తిభావం, దైవ చింతన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా శివానందస్వామిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి డా.శ్రీనివాస్, సభ్యులు రమేశ్, లక్ష్మయ్య, చంద్రశేఖర్, యాదయ్య, విష్ణువర్ధన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజానికి మార్గ నిర్దేశకులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

తుర్కయంజాల్: జర్నలిస్టులు సమాజానికి మార్గ నిర్దేశకులని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు అన్నారు. ఈ నెల 26వ తేదీన మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో నిర్వహించనున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, దర్శన్, టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు సిలివేరు యాదగిరి, కార్యదర్శి జగన్, జర్నలిస్టులు మణికుమార్, యాదయ్య, కుమార్, దేవరాజ్, ఉపేందర్, కార్తిక్, మల్లేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

ఆమనగల్లు: పట్టణంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు గురువారం పర్యటించనున్నారని మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువల నిర్మాణం, సురసముద్రం ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన వివరించారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ సుకన్య

యాచారం: దసరా పండుగను పురస్కరించుకుని బుధవారం మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య యాచారం గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేసే విషయంలో పంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు జంగయ్యగౌడ్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్‌గౌడ్



నిరసనలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మొయినాబాద్: దసరా సెలవుల్లో పాఠశాల నడుపుతున్న మేధా స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో గల మేధా ప్రైవేట్ స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న తరగతులను బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలలన్నింటికీ దసరా సెలవులు ఇస్తే మేధా స్కూల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని స్కూళ్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు యశ్వంత్, నాయకులు విఘ్నేశ్, నందీశ్వర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో తుల్జాభవానీ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రముఖ వేద పండితులు రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ రూ.25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో తులసీరాం, హీరాసింగ్, యాదగిరి, బిక్కునాయక్, గోపాల్, జగన్, యాదగిరి, భీంజీ, రాజు, రమేశ్, రతన్, రాము, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్



దేవాలయాన్ని పరిశీలిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: దేవాలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణంనెలకొంటుందని ఎంపీటీసీల ఫోరం మండల తాజా మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో నిర్మిస్తున్న పోచమ్మ, మైసమ్మ, నాగులమ్మ దేవాలయాలను ఆయన గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల నిర్మాణంలో గ్రామస్తుల సహకారం ఎంతో ఉందన్నారు. గ్రామానికి చెందిన బసగళ్ల కంసమ్మ, సత్తయ్యగౌడ్ పట్టాపొలం రెండు గుంటల భూమిని దేవాలయానికి ఇవ్వడంతో వారిని అభినందించారు. అదే విధంగా నిర్మాణానికి గ్రామానికి చెందిన శేరి సత్యనారాయణ రూ.8 లక్షలు, మోర శ్రీనివాస్ రూ.2.80 లక్షలు, కుండే గండయ్య, కుండే బీరయ్య కుటుంబం రూ.2 లక్షలు, మామిడి శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్ష, హేమంత్ లక్ష రూపాయలతో పాటు పలువురు దాతలుగా నిలవడం అభినందనీయమన్నారు. దేవాలయాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ వినిత్ కరుణాకర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంచంద్రయ్య, పాండురంగారెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, హరికృష్ణరెడ్డి, భిక్షపతి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



వంశీకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డిఘనాపూర్‌కు చెందిన వెన్నచెట్టి వంశీకృష్ణను బుధవారం గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు నర్సింలు, నర్సింహారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

సినీ నటుడిని కలిసిన కరాటే విద్యార్థులు



షాద్‌నగర్: సినీ హీరో సుమన్‌ను బుధవారం షాద్‌నగర్‌కు చెందిన పలువురు కరాటే మాస్టర్లు, విద్యార్థులు కలిశారు. న్యూపర్ కుంగ్‌ఫూ మాస్టర్ అహ్మద్‌ఖాన్, జపాన్ కరాటే మాస్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. పోటీల్లో గెలుపొందించిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా పతకాలు అందజేశారు.



ఇబ్రహీంపట్నం: అలంకరణలో అమ్మవారు



కడ్తాల్: గాయత్రీదేవిగా..



అబ్దుల్లాపూర్‌మెట్: తారామతిపేటలో..




ఆమనగల్లులో అన్నపూర్ణదేవిగా..

జగన్మాతకు జేజేలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఊరూరా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం సైతం అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో జగన్మాత వివిధ రూపాల్లో పూజలందుకున్నారు. మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగాయి.



యాచారం: సామూహిక లలితా సహస్రనామ పారాయణం



యాచారం: అన్నపూర్ణదేవిగా అమ్మవారు



ఆమనగల్లు: పూజలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి



కడ్తాల్: పూజలు చేస్తున్న భక్తులు



ఆమనగల్లు: హోమం నిర్వహిస్తున్న భక్తులు



అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లి జేబీవీఎస్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ